ఆ మాట వినగానే కమలమ్మ మొహం కమలంవలె వికసించింది. కొడుకులిద్దరు, కోడళ్లతో సహా వస్తున్నారట!

"నిజంగా!!" నమ్మశక్యం కానట్టు భర్తవంక చూసింది. అది నిజం కావాలని ఆమె గుండె కొట్టుకుంటున్నది.

"నిజమేనోయ్..."

మందహాసం ముందు, మాట తరువాత. బాలమల్లుకు ఆనందంగానే ఉంది. ఇల్లంతా సందడి- కొడుకులు ... కోడళ్లు... మనవలు, మనవరాళ్లు... ఆ దృశ్యాల్ని తలచుకుంటేనే హృదయం పులకించి పోతున్నది.

"ఇదిగో చదువు..." ఉత్తరం భార్య చేతికి ఇచ్చాడు బాలమల్లు.

ఆ ఉత్తరంలో కమలమ్మకు అక్షరాలు కనిపిస్తున్నాయా!... కొడుకులు కనిపిస్తున్నారు. వారి ఆట పాటలు గుర్తుకొస్తున్నాయి. కళ్లు చిప్పిల్లుతున్నాయి. ఉత్తరాన్ని ముద్దుపెట్టుకున్నది. కొడుకుల చెక్కిళ్లను ముద్దాడినంత సంబరం!

కొడుకులు ఇంట్లో దిగే రోజు రానే వచ్చింది. ఆ రోజు ఉదయం ఒక అరుదైన ఉదయం... పండుగనాటి ఉదయం! పసిడి కిరణాలతో ఇల్లంతా మెరిసిపోతున్నది. ఆ ముసలి దంపతుల మొహాలు మెరిసిపోతున్నాయి.

కమలమ్మ అడుగులు తడబడుతున్నాయి. ఏ పని ముందు చేయాలో, ఏపని తరవాతో తెలియక తికమక పడుతున్నది. మాటి మాటికి గోడ గడియారం వంక చూస్తున్నది. గదులు శుభ్రంగా కడిగింది. ముందు గదిని కొడుకులు చిన్నప్పుడు ఇష్టపడినట్లు సర్దింది. మళ్లీ మళ్లీ సర్దింది.

"నువ్వు తొందరగా మార్కెట్ కు పోయి కూరగాయలు తేవాలి..." భర్తకు పురమాయించింది.



"అట్లాగే - ఏమేం తేవాలో చెప్పు".

బాలమల్లు కలం, కాగితం తీసుకున్నాడు.

కమలమ్మ తేవలసిన కూరగాయలు చెప్పింది.

"ఊ.. ఇంకా.."అన్నాడు.

కమలమ్మ వెంటనే చెప్పలేక పోయింది.

"నువ్వు ఆలోచిస్తూ ఉండు. నేను బజారుకు తయారవుతాను..'' బాలమల్లు పైజమా తొడుక్కున్నాడు. తల దువ్వుకున్నాడు. అద్దాలు తుడిచి పెట్టుకున్నాడు.

"నీకూ కంగారుగానే ఉంది'' అన్నది కమలమ్మ.

"ఎందుకు?"

"కమీజు వేసు కోకుండానే తలదువ్వుకున్నావ్. అద్దాలు పెట్టుకున్నావ్!..."

"అవును కదూ...'' అన్నట్టు చూశాడు బాలమల్లు.

# దృశ్యాలు మారుతున్నాయి

## సదానంద్ శారద



అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ (యుఎస్ఏ), ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో 'కథాప్రభ'కు ఎంపికైన కథ

కమీజు వేసుకొని మరోసారి తల దువ్వుకున్నాడు.

కమలమ్మ నవ్వుకున్నది.

కేలండర్ లోని కృష్ణుడు నవ్వుతున్నాడు. భవిష్యత్తు కనిపించిందేమో!

టేబుల్ మీది గాంధీ తాత మొహంలో మాత్రం నవ్వు లేదు. ఆవేదన ఉంది!

భార్య చెప్పిన మరి కొన్ని దినుసులు రాసుకొని బాలమల్లు బజారుకు వెళ్లిపోయాడు.

వంటపనికి ఉపక్రమించిన కమలమ్మకు వస్తువులు కనిపిస్తేనా! రెండు కళ్లూ మనసకబారి పోయాయి! ఆ కళ్లను కొడుకులు ఆక్రమించుకున్నారాయె! వవ్వుదువ్వ కర్రముక్కగాను, స్టౌ మీది వంట దీపంలాను కనిపిస్తున్నాయి. ఇక బియ్యంలో రాళ్లెలా కనిపిస్తాయి!

రాళ్లు లేని బియ్యం తెచ్చుకోవాలంటే చేతిలో రాళ్లు మిగలవు! రప్పలు మిగుల్తాయి!... కనురెప్పలు తుడుచుకున్నది కమలమ్మ.

బాలమల్లు బజారుకు పోయి వచ్చేసరికి బియ్యంలో రాళ్లు మాత్రం ఏరగలిగింది కమలమ్మ.

"ఇంకా బియ్యం దగ్గరే ఉన్నావా!'' అంటూ వచ్చాడు బాలమల్లు. "కూరల కోసం ఎదురు చూస్తున్నావేమో అనుకున్నాను'' అన్నాడు.

"ఎంత-పావుగంటలో అన్నం అయిపోతుంది. కూరలేం తెచ్చావ్? గోగిపూవు దొరికిందా లేదా? పెద్దాడికి గోగిపూవు టమాట కూరంటే ఇష్టం. చిన్నాడికి గుత్తి వంకాయ పూర్ణం ఇష్టం-'' అన్నది కమలమ్మ... కూరలబుట్ట తీసుకొని చూస్తూ.

"అయితే ... రెండు కూరలు చేస్తావా?''

"అవునూ - బిడ్డలు రాక రాక వస్తున్నారు. వాళ్ళకు ఇష్టమైనవి చేసి పెట్టొద్దూ?... గోగిపూవు టమాట కూరలో వేడి వేడి పూరీలు పెద్దాడికి చాలా ఇష్టం. గోధుమపిండి ఎంత ఉందో కాస్త చూడవూ''

బాలమల్లు టీచర్ ఉద్యోగం చేసినన్నాళ్లు నెల నెలా జీతాలు అందక కష్టాలు పడ్డాడు. ఉద్యోగ విరమణ చేసినా పెన్షన్ సరిగా అందక కష్టాలు పడుతున్నాడు. పంతుళ్లకు కష్టాలకు వీడని ముడి వేశారు ఏలినవారు. అటువంటి ముడి ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు వేసి చూడమనండి... ఏలేవారి గొంతుకు బిగుసుకుంటుంది ముడి! పొదుపు పథకాలకు పంతుళ్లే దొరికారా పాపం!!

"ఇదిగో ఇది సరిపోతుందా?''- గోధుమ పిండి డబ్బా భార్య ముందు పెట్టాడు బాలమల్లు.

**కారం కారం కథాప్రభ**

డబ్బా ఒంచి చూసి

"సరిపోదు...''

భర్త ఏవంటాడో నని సంశయంగా చూసింది.

"అరకిలో సరిపోతుందా?''.. అని అడిగాడు.

"సరే.. అంతే తే-''

"ఇంకేవన్నా కావాలో చెప్పు. మళ్లీ మళ్లీ తిప్పకు-''

ఇంకేం తెప్పించాలో జ్ఞాపకం చేసుకోసాగింది కమలమ్మ.

"పచ్చి బటానీలు తెచ్చావా?'' అని అడిగింది.

"ఆఁ...''

"సాజీర, కొబ్బెర...''

"గసాలుతో సహా అన్నీ తెచ్చాను''

"ఒక సేమ్యా పాకెట్ తేవూ?... చిన్నాడికి సేమ్యా పాయసం, పూరీలంటే ఇష్టం''

అవన్నీ ఎందుకులే అంటానని అనుకుందో ఏమో-భార్య కళ్లలో తిరిగే నీళ్లను చూశాడు బాలమల్లు.

ఇప్పటిదాకా కళ్లలోని ఆ చెలిమ. తర తరాలుగా తల్లి కళ్లలోని చెలిమ అది!

"సరే... ఇంకా-'' అన్నాడు బాలమల్లు.

"యాలకులు, కిస్‌మిస్, బాదం...''

"ఊఁ..."

"చక్కెర ఎంతుందో చూస్తా ఆగు..."

"చూడకు... సరిపోయేంత ఉండదు-" అన్నాడు బాలమల్లు.

బాగ్ తీసుకొని మళ్లీ బజారుకు వెళ్లి పోయాడు. వంటపనిలో మునిగిపోయింది కమలమ్మ. కొడుకులు తమ కిష్టమైన వంటకాలు తినే దృశ్యం తలచుకుంటేనే ఆ తల్లి కడుపు నిండిపోతున్నది.


★ ★ ★

మధ్యాహ్నం పన్నెండు దాటింది. వెచ్చదనం నుండి వేడిగా మారిపోయింది ఎండ!

హైదరాబాదు నుంచి కొడుకులు ఇంకా రాలేదే అని ఎదురు చూసి చూసి ఆ ముసలి దంపతులు ఆందోళన పడుతున్నారు. వారి నాలుగు కళ్లు రెండై... ఆ రెండు ఒకే ఎదురు చూపై ద్వారానికి హత్తుక పోయాయి.

మనసు కొడుకుల మీద కొట్టుకుంటున్నది. వస్తానని ఆశపెట్టి... రాక... పేగుల్ని మెలిపెట్టేశారు.

పొద్దున పదిగంటల వరకు వస్తామని రాశారు. ఏ బండికి వచ్చేది తెలియదు. అందరూ కలిసి కారు మాట్లాడుకొని వచ్చేది తెలియదు అని రాశారు. అందుకే స్టేషన్‌కు వెళ్ల లేకపోయాడు బాలమల్లు.




ఇంటి దగ్గరే ఎదురు చూస్తున్నారు.

"ఏదైనా పని పడిందేమో..."

భర్త మాటలు కమలమ్మకు వినిపించ లేదు. కొడుకులు వస్తారు... వస్తారు అనే ఆమె మనసు కొట్టు కుంటున్నది.

మరో గంట సేపటికి వారి నిరీక్షణ ఫలించి ఇంటిముందు ఆటో ఆగిన చప్పుడయింది. ఆత్రంగా ఇద్దరూ వాకిలి గుమ్మం చేరుకున్నారు.

హైదరాబాదు నుంచి వచ్చిన కొడుకులిద్దరు చేతుల్లో చిన్న బ్యాగ్ లేకుండా ఆటో దిగారు. వెంట కోడళ్ల లేరు. పిల్లలు లేరు.

"బండి ఇంత లేటయిందా నాన్నా" బాలమల్లు కొడుకులకు ఎదురు వెళ్లాడు.

"లేదు నాన్నా-" అన్నాడు పెద్ద కొడుకు.

"పొద్దున్నే వొచ్చాం-" అన్నాడు చిన్న కొడుకు.

ఇద్దరూ ఇంట్లోకి వచ్చారు. తల్లిని పలకరించారు. కళ్ల నిండా కొడుకుల్ని చూసుకొని మురిసిపోయింది కమలమ్మ. ఆనందంతో ఆమె గుండె ఉక్కిరి బిక్కిరై నోట మాటరాలేదు. ఆవు లేగ దూడల్ని నాలుకతో తడిమి చూసుకున్నట్లు... కొడుకులిద్దరి భుజాల మీద చేతులు వేసి నిమిరింది. తలలు నిమిరింది.

"కోడళ్లు, పిల్లలు ఏరి నాయనా?" అని అడిగింది.

"పిల్లలకు స్కూలుంది కదా.. తీసుక రాలేదు-" అన్నాడు చిన్న కొడుకు.

"ఇన్నేళ్లయినా వరంగల్లు మారలేదు నాన్నా. ఒక డ్రైనేజి సిస్టమ్ లేదు. రోడ్లు లేని గల్లీలు.. నీళ్లు కదలని మోరీలు. ఆమోరీలకు కట్టుకున్న పాయఖాన్లు... పందులు.. ఛీఛీ... ఇంకెప్పుడు బాగుపడుతుంది ఈ ఊరు? కొడళ్లు వస్తే బాత్రూంకు ఇబ్బంది, లావెటరీకి ఇబ్బంది అని లాడ్జింగ్‌లో దిగాం. తమ్ముడూ నేను చెరో గది తీసుకున్నాం" అన్నాడు పెద్ద కొడుకు.

"మేం ఇబ్బంది పడుతుంటే చూడలేక మీ మనసు కష్టపడుతుంది. మిమ్మల్ని కష్టపెట్టొద్దు అని ఆపని చేశాం. ఇప్పుడే భోంచేసి కోడళ్లిద్దరు రెస్ట్ తీసుకుంటున్నారు. ముందు మాట్లాడి పోదాం అని మేం వచ్చాం. తరువాత వాళ్లను తీసుకొస్తాం.." అన్నాడు చిన్న కొడుకు.

కస్సు కస్సున గుండెల్లో కత్తులు దించేశారు కొడుకులు. పొంగి వచ్చే దు:ఖాన్ని ఆపుకోలేక వంటగదిలోకి వెళ్లిపోయింది కమలమ్మ. కొడుకులకు ఇష్టమని చేసిన వంటకాలు వెక్కిరిస్తూ కనిపించాయి. వేడి వేడి పూరీలు కోసం తడిపిన పిండి వెలవెలబోతూ కనిపించింది.

"కాళ్లు చేతులు కడుక్కోండి నాయనా భోం చేద్దురు." అంటున్నాడు బాలమల్లు.

"మీకిష్టమని మీ అమ్మ..." అని అతడు మాట పూర్తి చేయక ముందే- "ఇప్పుడే హోటల్‌లో తిని వచ్చాం నాన్నా-" అన్నాడు చిన్న కొడుకు.

వంటగదిలోని కత్తిపీట పేగుల్ని కర కర కోసేంత వాడిగా మెరుస్తున్నది. ఇంకా వాళ్లేం మాట్లాడు కుంటున్నారో కమలమ్మకు వినిపించ లేదు.

"ఇన్నాళ్లు మాకోసం ఎంతో కష్టపడ్డారు. ఇంకా మిమ్మల్ని కష్టపడనిస్తామా నాన్నా"

బడిపంతులు కొడుకులైనా వారికి లౌక్యం బాగా అబ్బింది.

ఇంకే మాట్లాడలేదు బాలమల్లు. అతని కళ్లూ మసకబారిపోయాయి.

కమలమ్మ కనుకొలకులు వేళ్లతో నొక్కుకొని గోడకు చేరగిలబడి కూర్చున్నది. ముందు గదిలోంచి ధ్వనులు తప్ప ఆమెకు మాటలు వినిపించలేదు. చెవులు గడలు పడి గాలి రొద వినపడుతున్నది. కళ్లు తెరిచినా ఆమెకు చూపు ఆనడం లేదు. మెదడు ఒక్కసారిగా మొద్దుబారిపోయింది. కొడుకులు లాడ్జింగ్‌లో దిగడం.. 'తనని కష్టపెట్ట కూడదని" అక్కడే భోంచేసి రావటం... అటువంటి సత్యాల్ని ఆ తల్లి మనసు జీర్ణించుకోలేక పోతున్నది.

పావుగంట... అరగంట... ఎన్ని గంటలైతే ఏవిటి కాలం స్తంభించి పోయింది.

"కమలా.." భర్త తట్టిలేపే సరికి ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసింది.

"నిద్ర పోతున్నావా?"

లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది.

"అయ్యో...బిడ్డ లేరి?" ఆత్రుతగా లేవబోయింది.

"నీకు చెప్పే వెళ్లారుగా.. లాడ్జింగ్‌కు వెళ్లారు. సాయంకాలం కోడళ్లను వెంటబెట్టుకుని వస్తారట... విన్నావా కొడుకుల మాటలు..." అన్నాడు బాలమల్లు.

అవి మాటలా వాడి వాడి బాకులు!

"ఏదో ఈ కాలం పిల్లలు.. ఈ ఇబ్బందులు పడలేరు. అందుకే లాడ్జింగులో దిగారు. తప్పేమిటి?" కొడుకులను వెనకేసుక వచ్చింది కమలమ్మ.

కాని కళ్లలోని నీటినెలా దాచగలదు. భర్తకు దొరికిపోయింది. "తప్పేం లేదులే-నిజానికి అది చాలా చిన్న విషయం. కొడుకుల అంతకంటే పెద్ద బాంబులు పేల్చారు విన్లేదూ?"

ఏం వినవలసి వస్తుందేమోనని కమలమ్మ గుండె వేగంగా కొట్టుకుంటున్నది.

"ఈ ఇల్లు అమ్మేస్తారట!"

"అమ్మేసి..."

"మనల్ని తమతో వచ్చేయమంటూన్నారు. ఇక్కడ వసతులు లేవు. ఈ ఇబ్బందుల్లో ఎందుకుంటారు. ఇల్లు అమ్మేస్తాం. మిమ్మల్ని హైదరాబాదు తీసుకపోతాం-అందుకే వచ్చాం అన్నారు..."

"ఊహుఁ..."

"తీసుకపోయి ఏం చేస్తారట తెలుసునా... నువ్వో కొడుకుదగ్గర... నేనో కొడుకు దగ్గర ఉండాలట.."

"నువ్వేమన్నావ్?..."

"కుదర్దు-మమ్మల్నిద్దర్ని ఒకే దగ్గర ఉంచి చేరి ఆర్నెల్లు పోషిస్తాం అన్నా రాం- మీకు ఇబ్బంది కలిగించం-హైదరాబాదు ఇరుకు ఇళ్లలో మాతో మీకు ఇబ్బందులు ఎందుకు నాయనా? ఇక్కడే ఉంటాం. కలో గంజో తాగి కృష్ణా రామా అంటూ ఇక్కడే ఉంటాం. మీరు అప్పుడప్పుడు వచ్చి చూసి పోతుంటే చాలు అన్నాను-"

వచ్చి లాడ్జింగ్‌లో దిగి చూసిపోతారా అనుకుని కమలమ్మ మనసు కలవర పడింది.

"ఇల్లు అమ్మేసి - ఆడబ్బును, మనల్ని చెరిసగం పంచుకొని పోదాం అని వచ్చారు..."

ఆ మాటలు వినలేక లేచి ముందు గదిలోకి వెళ్లిపోయింది కమలమ్మ...

కొడుకులు అప్పటి దాకా కూర్చొని వెళ్లిన కుర్చీల వంక చూసింది. ఎంతైనా తల్లి ప్రాణం!... కుర్చీలకు దగ్గరా వెళ్లి ఆప్యాయంగా వాటిని తడిమింది.

కేలండర్‌లోని కృష్ణుడు నవ్వుతున్నాడు కుర్చీలను తడిమి.. గాంధీ బొమ్మ పక్కన కుర్చీలో కూలబడి పోయింది కమలమ్మ. ఆపుకోలేని దు:ఖం ముంచుకు వచ్చింది ఆమెకు...


★ ★ ★

వారం రోజులు గడిచాయి. కొడుకులు, కోడళ్లు కలిగించిన మనస్తాపం నుంచి ఆ దంపతులు ఇంకా తేరుకోలేదు. ఒక రోజు కమలమ్మ దృష్టి గుమ్మం తలుపుపై పడింది. ఒక తలుపుపై పెద్ద కొడుకు పేరు కనిపించింది.రెండో తలుపు మీద చిన్న కొడుకు పేరు కనిపించింది.

చిన్నప్పుడు అలాగే రాసుకునే వారు. ఆ దృశ్యం కళ్లలో మెదిలి కమలమ్మ మనసు తేలిక పడింది.

"చిన్నప్పుడు రాసుకున్నట్లు... కొడుకులు తలుపుల మీద పేర్లు ఎట్లా రాసుకున్నారో చూశావా?" అని భర్తను అడిగింది- "చిన్ననాటి అభిమానం ఎట్లా పోతుంది-" అన్నది.

"అవి అభిమానంతో రాసిన రాతలు కావు కమలా. అనుమానంతో రాసినవి. కొడుకులకు తెలియకుండా మనం ఎక్కడ ఇల్లు అమ్ముకుంటామోనని అట్లా రాశారు. కొనేవాళ్లకు హెచ్చరిక అన్నమాట-"




భర్త మాటలు విని నివ్వెరపోయింది కమలమ్మ.

"మనం బతికుండగానే ఇల్లుపంచుకుని అమ్ముకునేట్టున్నారు-" అన్నది విచారంగా.

★ ★ ★

చుట్టుపక్కల ఇండ్లలోని పిల్లలు గున గున పరుగులు తీస్తూ పటాసులు కాల్చుకుంటున్నారు. ఇనుప గుండ్లలో పొటాష్ పోసి తుపాకీ దెబ్బలు పేల్చుతున్నారు. దీపావళి దగ్గర పడింది.

సందడి లేని ఆ ఇల్లు బోసిగా కనిపిస్తున్నది. కమలమ్మ భర్తతో అన్నది- "ఈ దీపావళికి మనం యాదగిరి గుట్టకు పోదాం".

బాలమల్లు మాట్లాడలేదు.

"పోదామా?" మళ్లీ అడిగింది.

ఈసారి బాలమల్లు భార్య మొహంలోకి చూసి సరే పోదాం అన్నట్లు తలూపాడు.

మరునాడే దీపావళి.

భార్య, భర్త యాదగిరి గుట్టకు పోవడానికి సామాను సర్దుకుంటున్నారు.

ఇంటి ముందు ఆటో ఆగింది.

గుండె ఆగినంత పనయింది దంపతులకు.

ఆటో నుంచి కూతురు, అల్లుడు, మనవడు, మనవరాలు దిగారు. కొడుకులు వచ్చి రేపిన గాయం తడి ఇంకా ఆరనే లేదు. కూతురు, అల్లుడు దిగారు. గుండెలమీదికి! దీపావళి కట్నం ఏం అడగటానికి వచ్చాడో అల్లుడు. ఇంటి పరిస్థితి తెలిసిన కమలమ్మ వజ వజ వణికి పోయింది.

"అమ్మమ్మా..." మనవడు, మనవరాలు గట్టిగా వాటేసుకునేసరికి పులకించి పోయింది కమలమ్మ. ఇద్దరినీ తనివితీరా ముద్దాడింది.

"ఇట్లా చిక్కిపోయా వేం అమ్మా..."కూతురు తల్లిని దగ్గరకి తీసుకొని అడిగింది. కమలమ్మకు దు:ఖం ఆగలేదు. కూతురు భుజం మీద తల ఆన్చి కన్నీళ్లు కార్చింది. తల్లిని పొదివి పట్టుకొని వంటగదిలోకి తీసుకు పోయింది కూతురు.

ముందు గదిలో మామ, అల్లుళ్లు మాట్లాడుకుంటున్నారు. పిల్లలు ఇల్లంతా కలయ తిరుగుతూ ఎగిరి గంతులు వస్తున్నారు. కేలండర్లోని కృష్ణుడు ఈర్ష్యగా చూస్తున్నాడు.

చీకటి పడింది. అలవాటుగా ముందు ట్యూబ్ లైటు వేశాడు బాలమల్లు. అలవాటుగా అది వెలగలేదు. మామూలు లాంప్ వేశాడు.

"అదేంటి మావయ్యా ట్యూబ్ వెలగడం లేదా?" అని అడిగాడు అల్లుడు.

"లేదు బాబూ..." అన్నాడు బాలమల్లు.

"స్టార్టర్ ప్రాబ్లమా?"

"చూశాను... బాగానే ఉంది"

అల్లుడు స్టూలు పైకి ఎక్కి స్టార్టరును చూశాడు. ట్యూబ్ బయటకి తీసి - చోక్‌ను సరి చేసి తిరిగి ట్యూబ్ బిగించాడు. "ఏదీ ఇప్పుడు స్విచ్ వేయండి' 'అన్నాడు.

బాలమల్లు స్విచ్ వేశాడు. ట్యూబ్ వెలిగింది. బాలమల్లు కళ్లు మెరిశాయి. పిల్లలు చప్పట్లు కొడుతూ గంతులు వేశారు.

తల్లిని చాపమీద కూర్చోబెట్టి వంట పనిలోకి దిగింది కూతురు. సామాన్ల డబ్బాలన్నీ ఖాళీగా ఉన్నాయి.

"అదేంటమ్మా. వంట సామానేం తెచ్చుకోలేదా? ఏం వండు కుంటున్నారు?" అని తల్లిని అడిగింది.

"మీ నాన్న, నేను యాదగిరి గుట్టకు వెళ్లామని తయారవుతున్నాం తల్లీ... అందుకే సామానేం తెచ్చుకోలేదు." అన్నది కమలమ్మ.

కొడుకులు బాకులు దించినప్పట్నించి బతుకు భారమై.. విరక్తి పెరిగి ... ఒకపూట తిని ఒకపూట పస్తు ఉండి నిరాశగా రోజులు ఈడ్చుకొస్తున్నారు.

"బాగుంది. మేం వస్తున్నట్టు ఉత్తరం రాస్తే మీరు గుట్టకు ప్రయాణమవుతున్నారా!"

"ఉత్తరమా!... రాలేదు బిడ్డా... ఇంక మీ నాన్న నడుగు"అన్నది కమలమ్మ.

కూతురు గబగబా ముందు గదిలోకి వెళ్లింది. నాన్నను అడగడానికి కాదు. భర్తను పక్కకు పిలిచి తేవలసిన సామాన్లేవిటో చెప్పింది.

"ఓయస్ అలాగే..." అని తలూపి వెళ్లి పోతున్న అల్లుడిని ఆపి "నేను కూడా వస్తున్నా ఆగు బాబూ-" అన్నాడు బాలమల్లు.

"మీరు పిల్లలతో కబుర్లు చెప్పుకుంటూ ఉండండి మావయ్యా- నేనిప్పుడే వస్తాకదా" అని వెళ్లిపోయాడు అల్లుడు.

దృశ్యాలు మారి పోతున్నాయి...!

"నువ్వెక్కడికీ పోవ ద్దు - మాకు కథలు చెప్పాలి తాతయ్యా..." అని పిల్లలు బాలమల్లును చుట్టేసి కదలనివ్వలేదు.

ఎన్నాళ్లయింది పాటాలు చెప్పి... కథలు చెప్పి.

బాలమల్లు కళ్లలో నీళ్లు తిరిగాయి. కేలండర్‌లోని చిన్ని కృష్ణుడు బొద్దుగా, ముద్దుగా కనిపించాడు.

★ ★ ★

భోజనాలైన తరువాత మధ్య గదిలో రెండు పీటలు వేసి తల్లిని, తండ్రిని కూర్చో బెట్టింది కూతురు. అల్లుడు పక్కనే నిల్చున్నాడు.

"ఎందుకమ్మా?" అని అడిగింది కమలమ్మ.

"ఉండండి చెబుతా" అని తండ్రికి బొట్టుపెట్టింది. తల్లికి బొట్టు పెట్టింది.

వారి చేతుల్లో కొత్త బట్టలు పెట్టింది. వద్దని వారిస్తున్నా వినకుండా తల్లి, తండ్రి పాదాలకు దండం పెట్టింది. కూతురు, అల్లుడు చేస్తున్న మర్యాదలకు ఉక్కిరి బిక్కిరైపోతున్నారు ఆ దంపతులు.

"మీరు చదివించిన పి.జి. చదువుకు ఇన్నాళ్లకు సార్థకత లభించింది నాన్నా-" అన్నది కూతురు గద్గద స్వరంతో.

"మీ కూతురు జూనియర్ లెక్చరర్ ఉద్యోగంలో చేరింది మావయ్యా' ' అన్నాడు అల్లుడు.

కూతురు వంక ఆప్యాయంగా చూశాడు బాలమల్లు. కూతురు తన వారసత్వాన్ని నిలబెట్టింది.

"వచ్చీరాని పెన్షన్‌తో మీరెంత కష్టపడ్తున్నారో తెలిసి, తన జీతంలో కొంత నెలనెలా మీకు పంపాలని నిర్ణయించుకున్నది. నాక్కూడా ఆ నిర్ణయం ఎంతో సంతోషాన్ని కలిగించింది" అంటున్న అల్లుడికి రెండు చేతులు జోడించి-

"అట్లా వద్దు బాబూ... వద్దు" అన్నాడు బాలమల్లు.

"మా మీద మీకున్న ప్రేమ చాలు బిడ్డా" అన్నది కూతురును దగ్గరికి తీసుకుంటూ కమలమ్మ.

"ఎందుకు వద్దు... ప్రేమలు, ఆప్యాయతలు కడుపులు నింపుతాయా! మీరు చెప్పించిన చదువుతో అంత జీతం సంపాదిస్తూ, మీకు అష్ట కష్టాలు పడుతుంటే చూస్తూ ఊర్కోవడం న్యాయమా?..."

"అదికాదు తల్లీ" అని ఏదో చెప్పబోయాడు బాలమల్లు.

"కొడుకులు ఇస్తానంటే ఇట్లాగే వద్దంటారా? తలిదండ్రుల్ని పోషించడం కొడుకుల బాధ్యత మాత్రమే అనుకుంటున్నారా ఇంకా??... ఆ హక్కు, బాధ్యత సంపాదించే ప్రతి కూతురుకు ఉన్నాయి నాన్నా. ఇందులో నేను, మా వారు చేస్తున్న త్యాగం ఏదీ లేదు. మా బాధ్యతను ఆనందంగా స్వీకరిస్తున్నాం. కొడుకులకు ఏ విధంగాను కూతుళ్లు తీసిపోరు అని నిరూపించే ఈ కాలంలో ఇంకేం అడ్డు చెప్పకండి..." అంటున్న కూతురు వంక.. ఎంతో ఎత్తుకు ఎదిగిపోయిన కూతరు వంక చిప్పిల్లిన కళ్లతో గర్వంగా చూశారు ఆ దంపతులు.

కొడుకులకంటే కూతురే నయం అనిపించావు తల్లీ.. అను కున్నారు మనసులో...!!

## గడుగ్గాయి

" ఈ తిన్నగా వెళ్లి కుడివైపు తిరిగి ముందుకెళ్లి మళ్లీ కుడివైపుకు తిరగండి. అదే సుబ్బారావుగా రిల్లు" అంటూ ఆ పెద్దాయనకి అడ్రస్ చెప్పాడు రామం.

వాడు చెప్పినట్లే వెళ్లిన సుందరం తిరిగి అక్కడికే చేరుకున్నాడు. "ఇదేంటి బాబూ! మళ్లీ ఇక్కడికే వచ్చాను?" అయోమయంగా అడిగాడు.

" నేను సుబ్బారావుగారి అబ్బాయిని ఇదే మా ఇల్లు..." అంటూ లోపలికి పరుగెత్తాడు ఆ గడుగ్గాయి.

యస్.శివరామకృష్ణ (తెనాలి)